
# వామ్మో ప్యానల్ బోర్డా..!



-ముడుపులిస్తేనే ఫైలు కదలిక.. -ఒక్కో విద్యుత్ కనెక్షన్‌కు లక్షల్లో వసూలు

-డిస్కంలో వేలల్లో దరఖాస్తులు పెండింగ్ -గగ్గోలుపెడుతున్న వినియోగదారులు




**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** గ్రేటర్‌లో విద్యుత్ ప్యానల్‌బోర్డ్ కనెక్షన్లు వేలల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ముడుపులిస్తే తప్ప ముందుకు సాగడం లేదు. ధరఖాస్తు దారుల నుంచి కిందిస్థాయి వరకు సిబ్బంది ఇష్టారీతిగా దండుకుంటున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా నిర్దేశించిన ధరల ప్రకారం సొమ్ము చెల్లిస్తేనే దస్త్రం ముందుకు కదులుతుంది. తక్కువలో తక్కువ రూ.లక్షల నుంచి రూ.3లక్షలరకు దరఖాస్తుదారుడి నుంచి లాగుతున్నారు. ఈదందాపై తరుచూ ఫిర్యాదులు అందుతున్నా డిస్కం యాజమాన్యం గట్టిగా చర్యలు తీసుకోలేకపోతోంది. ఉన్నతాధికారులు చెబితే లంచంలో రాయితీ ఇస్తున్నారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. గృహ వాణిజ్య, సముదాయాలలో ఏదైనా నాలుగు కనెక్షన్లు మించితే భద్రతా దృష్ట్యా ప్యానల్ బోర్డు ఏర్పాటు విధిగా చేసుకోవాలి. ఈనిబంధనే అక్రమార్కులకు పంటపండిస్తుంది. నాలుగు మించి కనెక్షన్లు ఉంటే సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి అన్నితీగలు లాగడం ప్రమాదకరం. భద్రతా రిత్యా నిర్మాణ ప్రాంగణంలోనే ఒక బోర్డు ఏర్పాటు చేసి అక్కడ మీటర్లు అమర్చుతారు. విద్యుత్‌స్థంభం నుంచి బోర్డుకు కనెక్షన్ ఇస్తారు. నిర్మాణాలు ఎక్కువగా జరిగే శివారు ప్రాంతాల్లో వినియోగదారులు ఎక్కువగా దరఖాస్తు చేసుకుంటున్నారు.

**ప్రతిదశలో చేయి తడపాల్సిందే...**

కనెక్షన్ కోసం వినియోగదారులసేవాకేంద్రంలో మొదటగా దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడే కొందరు దళారులు తిష్ట వేస్తున్నారు. వీరుకేవలం ప్యానల్ బోర్డ్ కనోనెక్షన్లు మాత్రమే చేపడతారు. సాధారణంగా దళారులు బయటివారు ఉంటే..డిస్కంలో సిబ్బందే దళారుల అవతారంఎత్తారు. వీరు లక్ష నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారు. వినియోగదారులు సేవా కేంద్రంనుంచి దరఖాస్తు సంబంధిత ఏఈకి వెళ్తుంది. వీరు అంచనాలు రూపొందిస్తారు. ఈపని చేయాలంటే చాలా సెక్షన్లలో రూ.10వేలు ఇవ్వాల్సిందే. అంచనా వేసే సబ్ ఇంజనీర్‌కు రూ. 2వేలు, ఆపరేటర్‌కు రూవెయ్యిగా ధర నిర్ణయించారు. ఇక్కడ నుంచి డిఈ వద్దకు దస్త్రం వెలుతుంది. ఆయన అనుమతికి రూ.పదివేలు నిర్ణయించారు. అనుమతి సమాచారం వినియోగదారులకు చేరగానే వినియోగదారుల సేవా కేంద్రంలో సొమ్ము చెల్లిచాల్సి ఉంటుంది. సొమ్ముచెల్లించగానే ఏఈ వర్క్‌ఆర్డర్ రాసి ఇస్తారు. ఇండోర్‌స్టోర్ నుంచి మీటర్లు ఇస్తారు. ఒక్కోమీటర్‌కు రూ.500ఇవ్వాలి . అవుట్‌డోర్ స్టోర్‌నుంచి తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి సామాగ్రిని అందజేస్తారు. వీరికి సామాగ్రి విలువను బట్టి రూ.2వేలనుంచి రూ.3వేల వరకు ఇవ్వాలి. అంచనాలో పేర్కొన్న పనులన్నీ కాంట్రాక్టర్ పూర్తి చేసాకా ఏఈ, ఏడీఈ తనిఖీ చేస్తారు. తని ఖీకి రావాలంటే మరో పదివేలు సమర్పించుకోవాలి. వీరు తనిఖీల అనంతరం నివేదికకు డీఈకి ఇస్తే..పనిపూర్తయినట్లు నివేదిక ఇవ్వడానికి ఇంకో రూ.పదివేలు ఇచ్చుకోవాలి. సరఫరా ఇవ్వాలనే ఆదేశాలు అక్కడినుంచి ఏడీఈకి,ఏఈకి వస్తాయి. ఇక్కడ రూ.పదివేలు ముట్టచెప్పాల్సిందే. అక్కడి నుంచి లైన్ ఇన్స్‌స్పెక్టర్‌కు రూ.ఐదువేలు ఇవ్వకుంటే సరఫరా ఇవ్వడు. లైన్‌మెన్లు, ఇతర సిబ్బందికి ఎంతోకొంత ఇవ్వాలి. కొందరు సిబ్బంది, అధికారులు నిజాయితీగా పనిచేస్తున్నా.. అధిక శాతం ఇంజనీర్లు ఆరోజుఎన్ని అంచనా ఇచ్చాం.. ఎంతవచ్చిందనే లెక్కలు వేసుకుంటున్నారు.దీంతో వీరి పేరు చెప్పి దళారులు మరింత దండుకుంటు న్నారు. ఇలా నగర శివారు సర్కిళ్ల మేడ్చల్, రా జేంద్రనగర్, గచ్చిబౌలి, సరూర్‌నగర్‌లలో ఈవ్య వహారం జోరుగా సాగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

**నిబంధనల పేరుతో..**

అన్నీ సంక్రమంగా ఉంటే దశలవారిగా దండుకుంటున్న కొందరు..నిబంధనలు ప్రకారం లేనివివస్తే గంపగుత్తగా ధర చెబుతున్నారు. 10మీటర్ల ఎత్తు దాటిన భవనాలకు జీహెచ్‌ఎంసీ ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుంది. కానీ అవిలేకున్నా రూ.లక్షల్లో దండుకొని కనెక్షన్లు ఇస్తున్నారు. దరఖాస్తు దారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి వదిలేస్తే ఎన్నిరోజులైనా కనెక్షన్‌రాదు. వచ్చి సంబంధిత సిబ్బందిని కలిసి ఇవ్వాల్సింది ఇస్తే చకచకా పనవుతుంది. సొమ్ము చెల్లించకపోతే ఎన్నిరోజులైనా పెండింగ్‌లోనే ఉంటాయి. పారదర్శకత లేకపోవడమే డిస్కంలో విచ్చలవిడిగా అవినీతి సాగుతుందని ఆరోపణలు ఉన్నాయి.



# హైదరాబాద్ వార్త

# మెట్రో రెండో దశకు పరుగులు..!

- రెండో దశ ప్రతిపాదనలు సవరించిన ప్రభుత్వం
-మొత్తం దూరం 78.4కి.మీ..అంచనా వ్యయం రూ.24వేల కోట్లు
-మొదలుకానున్న పాతబస్తీ మెట్రో పనులు



**హైదరాబాద్, జూలై 26 ప్రభాతవార్త**

మెట్రో రైలు రెండో దశ విస్తరణపైనా ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ బడ్జెట్‌లో రూ.1100 కోట్లు కేటాయించింది. రెండో దశలో భాగంగా వివిధ మార్గాల్లో 78.4 కి.మీ. మేర విస్తరణకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.24,042 కోట్ల వ్యయం కానున్నట్లు ప్రాథమిక అంచనా.దీంతో మెట్రో రైలు రెండో దశలో దూరం, అంచనా వ్యయాలు పెరిగాయి. 5 కారిడార్లలో 70 కి.మీ దూరం గతంలో ప్రతిపాదించగా ఇప్పుడు అంది 8.4కి.మీ పెరిగి 78.4కి.మీ అయింది. అంచనా వ్యయం పెరిగి రూ.24,042 కోట్లకు చేరింది. ప్రభుత్వం రెండో దశ ప్రతిపాదనలను సమీక్షించి వాటిని సవరించి కొత్త ప్రతినాదలను రూపొందించినట్లు బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి భట్టి తన ప్రసంగంలో పేర్కొన్నారు. కాగా, నాగోల్, ఎల్బీనగర్, చంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి చౌరస్తా నుంచి జల్‌పల్లి మీదుగా ఎయిర్‌పోర్టు విమానాశ్రయం వరకు తొలుత 29కిలోమీటర్లుగా ఎయిర్‌పోర్టు మెట్రోని అంచనా వేశారు. ఇది నేడు కాస్త 4 కి.మీకుపైగా పెరిగింది. ఇదే కారిడార్‌లో మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్, కొత్తగా నిర్మితమయ్యే హైకోర్టు వరకు 5కి.మీ పైగా మెట్రో మార్గం కూడా రెండో దశలో ప్రతిపాదించారు. దీంతో పాటు ఎల్బీనగర్ నుండి హయత్‌నగర్, మియాపూర్ నుండి పటాన్‌చెరు, ఫలక్‌నుమా నుండి చంద్రాయణగుట్ట కారిడార్లలో పెద్దగా మార్పుల్లేవు.రాయదుర్గం నుంచి విప్రో కూడలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని యూఎస్ కాన్సులేట్ వరకు 8కి.మీ మార్గాన్ని తొలుత ప్రతిపాదించారు. దీన్ని కోకాపేటలోని నియో పోలిస్ వరకు విస్తరించాలని సర్కారు నిర్ణయించింది. దీంతో ఇక్కడ 3.3 కి.మీ పైగా పెరిగింది. ఈ కారణంగా అంచనాలు పెరిగాయి.మెట్రో డిపో కూడా ఇక్కడే ఏర్పాటు చేసేందుకు అనువైన భూముల కోసం అధికారులు కొద్దిరోజుల కిందట పరిశీలించారు. అలాగే నాగోల్, ఎల్బీనగర్, చంద్రాయణగుట్టలను మెట్రో ఇంటర్‌ఛేంజ్ స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రకటించారు.

**మొదలుకానున్న పాతబస్తీ పనులు..**

ఇప్పటికే 69 కిలోమీటర్ల మేర పరుగులు పెడుతున్న మెట్రో రైలును కొత్త ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించింది.ఎంజీబీఎస్ నుంచి పలక్‌నుమా వరకు 5.5కి.మీ మెట్రో విస్తరణ పనులను సిఎం రేవంత్‌రెడ్డి మార్చిలో శంకుస్థాపన చేశారు. రూ.2వేల కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈసారి బడ్జెట్‌లో పాతబస్తీ మెట్రో కోసం ప్రతిపాదించిన రూ.500 కోట్లలో కేటాయింపులు జరిగితే భూసేకరణ, రహదారుల విస్తరణ చేపట్టి పనులు మొదలుపెట్టడానికి అవకాశం ఉంటుంది.రూ.1100 కోట్లలో ఎంజీబీఎస్ టు ఫలక్‌నుమా వరకు 5.5కి.మీల మార్గంలో పనులు ప్రారంభించేందుకు రూ.500 కోట్లు వెచ్చించారు. ఈ రూట్‌లో ఇప్పటికే డీపీఆర్ సిద్ధం కావడంతో ఆక్రమణల తొలగింపు, పరిహారాల చెల్లింపు, రహదారుల విస్తరణ, అలైన్‌మెంట్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మరో రూ.100 కోట్లతో ఎయిర్‌పోర్టు కారిడార్‌లో పనులు ప్రారం భించనున్నారు.

# జిహెచ్‌ఎంసి కార్యాలయంలో కాంగ్రెస్ కార్పొరేటర్ల సంబురాలు

-రూ.3,065 కోట్ల బడ్జెట్ కేటాయింపుపై హర్షం



మేయర్‌విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతకు స్వీట్లు తినిపిస్తున్న మహిళా కార్పొరేటర్లు

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో జిహెచ్‌ఎంసికి రూ.3,065కోట్లు కేటాయింపుపై శుక్రవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు సంబురా లు జరుపుకున్నారు. ఈసందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డితోపాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ బాణాసంచా కాల్చి ,మిఠాయిలు పంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రబడ్జెట్‌లో హైదరాబాద్ నగరాభివృద్ధికి సుమారు 10వేలకోట్ల రూపాయలు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా జిహెచ్‌ఎంసికి రూ.3,065 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జలమండలికి రూ.3385 కోట్లు కేటాయింపుతో నగరంతో నగరంలో అతిముఖ్యమైన మంచినీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగర మౌళిక సదుయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి ,ఔటర్‌రింగ్‌రోడ్ వరకు జిహెచ్‌ఎంసి విస్తరణ హైడ్రా ఏర్పాటు ,నగ రాభివృద్ధికి ఎంతో ఉపయుక్తం అవుతుందని పేర్కొన్నారు.

# ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



-పరేడ్ మైదానంలో అమర సైనిక స్థూపానికి నివాళులర్పించిన ఆర్మీ ఉన్నతాధికారులు





**బేగంపేట జులై 26, ప్రభాతవార్త** కార్గిల్ విజయ్ దివస్ 25వ సంవత్సరం పురస్కరించుకొని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలోని అమర సైనిక స్థూపం వద్ద శుక్రవారం ఆర్మీ ఉన్నతాధికారులు అమర సైనికులకు నివాళులు అర్పించారు.1999 కార్గిల్ యుద్దంలో ప్రాణత్యాగం చేసిన వీరజవాన్లకు పలువురు నివాళులు అర్పించారు.తెలంగాణా ,ఆంధ్రా సబ్ ఏరియా (టాసా)ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ ఆఫీసర్,మేజర్ జనరల్ రాకేష్ మనోచా ముఖ్య అతిధిగా హాజరై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు.కార్యక్రమం ప్రారంభంలో భాగంగా ఆర్మీలో జూనియర్ అధికారి ముందుగా నివాళులు అర్పించారు. మిలట్రీ బ్యాండ్ నేతృత్వంలో ఆర్మీకి చెందిన పలువురు ఉన్నతాధికారులు నివాళులు అర్పించి దేశం కోసం ప్రాణాలర్పించిన అమర సైనిక త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సైనికాధికారులు, వివిధ జిల్లాల నుంచి హాజరైన మాజీ సైనికులు పాల్గొన్నారు.

**ఆయుధాల ప్రదర్శన ఏర్పాటు...**

కార్గిల్ యుద్దం జరిగి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పరేడ్ మైదానంలో టాసా ఆధ్వర్యంలో ప్రజల సందర్శనార్థం ఆయుధ ప్రదర్శనను ఏర్పాటు చేసారు.వివిధ రకాలైన ఆయుధాలు, ట్యాంకర్లు,శక్తివంతమైన ఆర్టిలరీ గన్‌లు,అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగిన మైన్స్,బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు,బైనాక్యులర్లు,రాడార్ వ్యవస్థ, రైఫిల్స్, కమ్యూనికేషన్,సిగ్నలింగ్ పరికరాలు తదితరాలను ఈ ప్రదర్శనలో ఉంచారు.ఈ ప్రదర్శనను తిలకించేందుకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు,ఎన్‌సీసీ,తో పాటు యువత ఎక్కువగా ఈ ప్రదర్శనను సందర్శించి ప్రదర్శనలో ఉంచిన వస్తువుల గురించి తెల్సుకున్నారు.సాయంత్రం వరకు ఈ ప్రదర్శన కొనసాగింది.ఈ ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో యువత,విద్యార్థులు తరలివచ్చారు.

# రేణూ దేశాయ్‌ను సత్కరించిన మంత్రి కొండా సురేఖ



**పంజగుట్ట, జూలై 26 (ప్రభాతవార్త):** రాష్ట్ర పర్యావరణ అడవుల శాఖ మంత్రి కొండా సురేఖ జూబ్లీహిల్స్‌లోని నివాసంలోసినీనటి రేణుదేశాయ్ శుక్రవారం కలిశారు.ఫౌండేషన్ ఫర్ వేదిక్ స్టడీస్ చీఫ్ అడ్వైజర్ హోదాలో రేణుదేశాయ్ మంత్రిసురేఖతో భేటీ అయ్యారు. వీరిరువురు పర్యావరణం,వన్యప్రాణుల సంక్షేమం, ఆధ్యాత్మిక రంగాలపై చర్చించారు.రేణుదేశాయ్ భగవద్గీత ఫౌండేషన్ ఫర్ వేదిక్ స్టడీస్ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే ప్రప్రథమంగా నెలకొల్పనున్న గీత విశ్వవిద్యాలయానికి సంబంధించిన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా తన ఇంటికి అతిధిగా వచ్చిన రేణుదేశాయ్‌ను మంత్రి సురేఖ నూతన వస్త్రాలు, పండ్లు, పసుపు కుంకుమలతో సత్కరించారు. సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ ప్రత్యేకంగా భహుకరించారు. మంత్రి కుటుంబ సభ్యులుతనను ఆదరించిన తీరుపట్ల రేణుదేశాయ్ సంతోషం వ్యక్తం చేశారు.

## జర్నలిస్ట్ కాలనీలో 20 తులాల నగలు ,నగదు అపహరణ..

## -పట్ట పగలు తాళం వేసిన ఇంట్లో చోరీ..

**కొంపల్లి, జూలై 26, ప్రభాతవార్త**

నిజాంపేట్‌లో పట్టపగలే దొంగతనం జరిగి నగలుతో పాటు నగదు గోచుకెళ్లిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉండే వెంకట్రావ్ అతని కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఆయన వృత్తి నిమిత్తం బయటకు వెళ్లగా అతని భార్య హాస్పిటల్‌కు వెళ్లారు. సుమారు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చి బీరువా ఓపెన్ చేయగా అందులో 20 తులాల నగలుతో పాటు 1,60,000 నగదు కనిపించలేదు. బీరువా తాళం కూడా వేసిన తాళం వేసినట్టు ఉంది. రూమ్‌లో వెతగా తాళం బీరువా కింద పెట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘ టన స్థలానికి పోలీసులు వచ్చి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సినీ నటుడిపై కేసు నమోదు

**బేగంపేట జూలై 26, ప్రభాతవార్త :** పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి ఓ యువతిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన సినీ నటుడిపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ సమీపంలో నివసించే మహిళ (34)కు బేగంపేట బ్రాహ్మణ వాడీలో నివసించే సినీ నటుడు అమన్ సింగ్ (27) తో జిమ్‌లో పరిచయం ఏర్పడింది.పరిచయం ప్రేమగా మారింది.ఈ క్రమంలో 2023 అక్టోబర్‌లో మహిళను తన ఫ్లాట్‌కు పిల్చిన అమన్ సింగ్ పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు.ఆ తరువాత కూడా ఆమెతో పలు మార్లు శారీరకంగా కలిశాడు.తనకు డబ్బులు అవసరం ఉందని చెప్పి యువతి వద్ద రూ 15లక్షలు తీసుకున్నాడు.ఆ తరువాత ఆమెను తప్పించుకుని తిరగసాగాడు.పెళ్లి చేసుకొమ్మని యువతి అడిగితే తన వద్ద ఉన్న ఫోటోలు,వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బాధితురాలిని బెదిరించాడు.దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.ఈమేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చప్పన్‌భోగ్ అలంకరణలో బేలా ముత్యాలమ్మ అమ్మవారు

**చాంద్రాయణగుట్ట, జూలై 26 ప్రభాతవార్త,**

ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలను పురష్కరించుకొని శుక్రవారం బేలా ముత్యాలమ్మ అమ్మవారు చప్పన్‌భోగ్ అలంకరణలో దర్శనమిచ్చింది. ఆలయ కమిటీ సభ్యులు పొటేల్ సదానంద్ యాదవ్, పొటేల్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అమ్మవారికి 56 రకాల మిఠాయిలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాము యాదవ్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



56 రకాల మిఠాయిలతో దర్శనమిస్తున్న ముత్యాలమ్మ అమ్మవారు.

## రేపు, ఎల్లుండి మద్యం షాపులు బంద్

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:**

మంహంకాళీ బోనాల పండగను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ అంతటా ..నాన్‌ప్రొయిటరీ క్లబ్‌లు, స్టార్‌హోటళ్లు , రెస్టారెంట్‌లతో సహా అన్ని వైన్‌షాపులు మూసివేయబడతాయని సిపి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. జూలై 28 (ఆదివారం) ఉదయం 6గంటల నుంచి సౌత్‌ఈస్ట్ జోన్‌లో చాంద్రాయణగుట్ట, బండ్లగూడ , సౌత్‌జోన్‌లో చార్మినార్, కమాటిపురా, హుస్సేని హలం, ఫలక్‌నుమా, మొఘల్‌పురా, ఛత్రినాక, షాలిబండ, మీర్‌చౌక్ ప్రాంతాల్లో రెండు రోజులపాటు కల్లు, వైన్‌షాపులు,హోటళ్లు రెస్టారెంట్లను ,క్లబ్బులను, మద్యం విక్రయించే లేదా అందించే ఇతర సంస్థలు మూసివేయబడతాయని పేర్కొన్నారు.

## దేశ వీర సైనికుల త్యాగాలను స్మరించుకుందాం

-కార్గిల్ విజయ్ దివస్‌లో ఏఐవైఎఫ్ నాయకులు




కార్గిల్ విజయ్ దివస్‌లో ఏఐవైఎఫ్ నాయకులు

**ముషీరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** భారతదేశ వీర సైనికుల త్యాగాలను స్మరించుకుందామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై నున్న యుద్ధ ట్యాంక్‌ముందు కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జులై 26న కార్గిల్ యుద్ధంలో మన సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ కార్గిల్ యుద్ధ విజయోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. భారత రక్షణ రంగాన్ని ప్రైవేట్ పరం చేసే అగ్నిపథ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర నాయకులు నెర్లకంటి శ్రీకాంత్, టి.సత్యప్రసాద్, శ్రీమాన్, ఆర్.బాలకృష్ణ, షేక్ మహమూద్, మాజీద్‌అలీఖాన్, రాజ్‌కుమార్, శేఖర్, వంశీ, అనిల్‌కుమార్, బాలు, మహేష్, మురళి, కిరణ్,ధీరజ్, కృష్ణ పాల్గొన్నారు.

## వేటూరి పాటల్లో రాగప్రస్తావన అమోఘం

-జాతీయ, గోల్డెన్‌గ్లోబ్, ఆస్కార్ పురస్కారాల గ్రహీత చంద్రబోస్



వేటూరి గీతామృతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబోస్, లక్ష్మీభూపాల, మాధురి, కార్తిక్ తదితర అతిథులు

**నాంపల్లి, జులై 26 ప్రభాతవార్త :** వేటూరి పాటల్లో రాగప్రస్తావన చాలా గొప్పది : జాతీయ, గోల్డెన్‌గ్లోబ్, ఆస్కార్ పురస్కారాల గ్రహీత డా. చంద్రబోస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన పాటల్లోని వివిధ రాగాల పేర్లను పొందుపరచిన ఆయా పాటల చరణాలను పాడి వినిపించారు. వేటూరి రాగలక్షణాలు లేని ఎన్నో చిలిపి రాగాలనూ సృష్టించారని వాటినీ వినిపించారు. కవులు ఏడురకాలని, వారిని సప్తవిధ కవులంటారని, వారు ఏడులక్షణాల కలిగి ఉంటారని, ఈ 7లక్షణాలు కలిగివున్న మొదటి కవి పోతన్న, రెండవ కవి వేటూరి మాత్రమేనని స్పష్టం చేశారు. వేటూరి రాగప్రస్థానం, అలంకారాలు, పదబంధాల సృష్టి గురించి పుస్తకాలు వ్రాయాలని రచయిత్రి మాధురికి సూచిస్తూ మనస్ఫూర్తిగా అభినందించి శుభాభినందనలు తెలిపారు. బృందావనం సాంస్కృతిక సంస్థ, తపస్వి మనోహరం ప్రచురణల సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి మాధురి ఇంగువ రచించిన వేటూరి గీతామృతం పుస్తకావిష్కరణ మహోత్సవం, సంగీత విభావరి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. చంద్రబోస్ విశిష్ట అతిథులు వర్ధమాన సినీగేయ, కథా రచయిత లక్ష్మీభూపాల, కె.వెంకటరావు, బహుముఖ ప్రజ్ఞావంతురాలు, రచయిత్రి మాధురి ఇంగువ, నిర్వాహకులు వై.సుబ్రహ్మణ్యం, ఎన్.కార్తీక్ తదితరులతో కలిసి వేటూరి గీతామృతం (వేటూరి సుందరరామ మూర్తి సినీగీతాల విశ్లేషణ భాగం-1)ను ఆవిష్కరించి రచయిత్రిని ఎంతగానో అభినందించి ఘనంగా సత్కరించారు. సభకుముందు వర్ధమాన గాయనీగాయకులచే దొరకునా ఇటువంటి సేవ శీర్షికన కవికులాలంకార బ్రహ్మశ్రీ డా. వేటూరి సుందరరామమూర్తి రచించిన ఆణిముత్యాల్లాంటి సినీగీతాల సంగీత విభావరి వీనుల విందుగాసాగి విచ్చేసిన అశేష ప్రేక్షకులు, సంగీతప్రియులను మంత్రముగ్ధులను చేసింది.

## ఆస్తి పన్ను లక్ష్యాలు అధిగమించాల్సిందే

-జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** లక్ష్యం మేరకు ప్రాపర్టీ టాక్స్ వసూలుకు చర్యలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి తెలిపారు. ఈమేరకు శుక్రవారం జోనల్ అడిషనల్ కమిషనర్‌లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిఆర్‌ఎంపి ద్వారా చేపట్టిన రోడ్లకు సంబంధించిన ఏజెన్సీలతో చేసుకున్న అగ్రిమెంట్ డిసెంబర్ వరకు గడువు ఉన్నందున పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ పనులు వెంటనే పూర్తి చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఏజెన్సీ ఒప్పందంలో ఉన్న అంశాలకు పెండింగ్ పనులను పూర్తిచేయాలని తెలిపారు. అవసరమైతే ఏజెన్సీలతో జోనల్ స్థాయి సమీక్ష చేసి ఒప్పందం చేసుకున్న విధంగా ఏమైనా గ్యాప్‌ఉంటే వెంటనే పనులు చేయించాలని తెలిపారు. అలాగే డెంగ్యూ వ్యాధి నియంత్రణకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు మరింత ముమ్మరంగా చేపట్టాలని తెలిపారు. దోమలతో వచ్చే వ్యాధులతోపాటుగా ఈగల ద్వారా వచ్చే వ్యాధులపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. పరిసరాల శుభ్రతపై నగర వాసులు దృష్టిసారించాలని సూచించారు. కమ్యూనిటీ హాల్స్ వివరాలు సర్కిళ్లవారీగా పూర్తి నివేదిక సమర్పించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# రైతులు, వ్యాపారస్తులకు 150 కోట్ల టోకరా

## నమ్మించి మోసం చేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి



ట్రేడర్స్ కార్యాలయంలో వివరాలను తెలియజేస్తున్న వ్యాపారస్తులు

**మలక్‌పేట, జూలై 26 ప్రభాతవార్త:** వ్యాపార కార్యకలాపాల్లో తోటి వ్యాపారస్తులు, రైతులతో మంచిగా ఉంటూ నమ్మకంగా వ్యవహరిస్తూ మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌లో చింతపండు కమిషనర్ ఏజెంట్ కాలేరు శ్రీనివాస్ పలువురు రైతులు, వ్యాపారస్తులను మోసం చేసి సుమారు 150 కోట్ల టోకరా పెట్టి పారిపోయాడని వ్యాపారస్తులు దేవర రాజేశ్వర్, చేగూరి వెంకటరమణ, దేవత అశోక్, కట్టా మల్లేషంలు ఆరోపించారు. శుక్రవారం ట్రేడర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాలేరు వెంకటేష్ గత 15 సంవత్సరాలుగా చింతపండు కమిషన్ ఏజెంట్‌గా మార్కెట్‌లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని, అతనికి 2 కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్స్ ఉన్నాయని తెలిపారు. ఇతను రైతుల నుండి చింతపండు కొనుగోలు చేసి వ్యాపారస్తులకు విక్రయిస్తాడని, చింత పండుకు ధర రాకపోతే అతని స్వంత గోదాము, కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచుతూ, రైతులు, వ్యాపారస్తులకు నమ్మకంగా ఉంటూ ఒకిరికి తెలియకుండా మరొకరి వద్ద కమిషన్ వ్యాపారం పేరుతో సుమారు 180 మంది బాధితుల వద్ద నుండి సుమారు 150 కోట్ల రూపాయలు అప్పుగా తీసుకుని పారిపోయాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేసారు. కాగా విషయం తెలుసుకునేలోపు పలువురికి ఐపి నోటీసులు వచ్చాయని బాధితులు తెలిపారు. కాలేరుకు అప్పు ఇచ్చిన పలువురు వ్యాపారస్తులు మానసిక ఒత్తిడికి గురయ్యారని, వారిలో కొందరు మృతి చెందారని అన్నారు. సుమారు 150 150 కోట్ల రూపాయలతో పరారైన వ్యాపారి కాలేరు శ్రీనివాస్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ సంఘటనతో మార్కెట్‌లో వ్యాపారంచేయాలంటే భయంగా ఉందన్నారు. కాలేరుతో పాటు అతని బంధువు దాత్రి వెంకటేష్ కూడా మోసంలో పాలు పంచుకున్నాడని ఆరోపించారు. వ్యాపారస్తులందరూ తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో ఆస్తులను బినామిలకు బదలాయించాడని, కోల్డ్ స్టోరేజీలను విక్రయించేసాడని తెలిపారు. సిసిఎస్ పోలీసులు కాలేరు శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు రాధాకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారమే నా ధ్యేయం : కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

**నేరెడ్‌మెట్, జూలై 26 ప్రభాతవార్త :** వినాయక్‌నగర్ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గత కొంత కాలంగా కాకతీయనగర్ లోని లిటిల్ పల్స్ పాఠశాల వద్ద ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా గుంతలుగా మారడంతో విషయం తెలుసుకున్న కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి శుక్రవారం సంబంధిత అధికారులతో ఆ రోడ్డుకు మరమ్మతు పనులను చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఇ లౌక్య, ఏఇ సత్యలక్ష్మి, వర్క్ ఇన్స్‌పెక్టర్ సాగర్, వెంకటేష్, బీజెపి డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, ఉపాధ్యక్షులు సాయి సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పర్యవేక్షణ : లచ్చిరెడ్డి



పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 26 ప్రభాతవార్త:** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీలో జరుగుతున్న పార్కు పనులను కాలనీ వాసులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ పార్కులో పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డిఇ దామోదర్ రావు, ఎఇ నరేందర్ తేజ, కాలనీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, విట్టల్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, బాకారం నరసింహారెడ్డి, సూర్యవర్ధన్‌రెడ్డి, పద్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ముత్యంరావు, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్య, పురుషోత్తంరెడ్డి, సంజీవరెడ్డి, చంద్రయ్య, నారాయణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం



ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

**సైదాబాద్, జూలై 26 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ యాకుత్‌పుర నియోజకవర్గం బిజెపి కన్వీనర్ బండ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్ మెయిన్ రోడ్డుపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, జిల్లా బిజెపి అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటిని కాంగ్రెస్‌పార్టీ గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రం దివాళా తీసే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంటు కో కన్వీనర్ మహేష్, నాయకులు నిరంజన్‌యాదవ్, రాజేశ్వర్, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంధ బాలికపై అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



అంధ బాలికల వసతి గృహంవద్ద ఆందోళన నిర్వహిస్తున్న రాంబాబు తదితరులు

**మలక్‌పేట, జూలై 26 ప్రభాతవార్త:** మలక్‌పేట అంధ బాలిక వసతి గృహంలో 3వ తరగతి చదువుతున్న 8 సంవత్సరాల అంధ బాలికపై అనుచితంగా ప్రవర్తించిన బాత్‌రూమ్స్ క్లీన్ చేసే నరేష్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అందె రాంబాబు డిమాండ్ చేసారు. అంధ బాలికపై అనుచితంగా ప్రవర్తించిన సంఘటనలో అసలు విషయం కప్పిపుచ్చి తప్పుదోవ పట్టించడంతో అందె రాంబాబు ఆధ్వర్యంలో మలక్‌పేట అంధ బాలికల వసతి గృహంవద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల వసతి వసతి గృహంలో 8 సంవత్సరాల అంధ బాలికపై జరిగిన సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని నిందితుడు నరేష్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేసారు. సంఘటనపై అలసత్వం వహించిన పోలీసులపై కూడాచర్యలు తీసుకోవాలన్నారు. కాగా బాలికల వసతి గృహం వద్దకు సైదాబాద్ మండల తహసీల్దార్ జయ విచ్చేసి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆందోళన విరమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్, మౌనిక తదితరులతోపాటు పలువురు వికలాంగులు పాల్గొన్నారు.

## నాగార్జున మాంటిస్సోరి, ఒలంపియాడ్ పాఠశాలల్లో ఘనంగా శాకాంబరి ఉత్సవాలు



శాకాంబరి ఉత్సవంలో పాల్గొన్న చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి



శాకాంబరి ఉత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**సైదాబాద్, సరూర్‌నగర్, జూలై 26 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ గాయత్రి నగర్ చౌరస్తాలోని నాగార్జున ది నెక్స్ట్ జెన్ పాఠశాలలో శుక్రవారం శాకాంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు ప్రకృతి మానవాళికి అందించిన గొప్ప వరమని అన్నారు. పండ్లు కూరగాయలలోని పోషక విలువలపై చిన్నారులకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. చిన్నారులు జంక్ ఫుడ్‌కు అలవాటు పడకుండా ప్రకృతి సిద్ధమైన అన్ని పోషకాలతో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకునే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రవీందర్‌రెడ్డి, ఇంఛార్జిలు రూప, జ్యోతి, సరిత, మాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మీర్‌పేట నాగార్జున పాఠశాలలో...** మీర్‌పేట నాగార్జున మంటెస్సోరీ, ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్లో శుక్రవారం శాకంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రకరకాల కూరగాయలతో అలంకరించిన అమ్మవారి రూపం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మహేష్, ఇంఛార్జులు దుర్గ, సంధ్య, ప్రశాంతి, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో ఘనంగా ఆదివారం ఘటాలు, ఫలహార బండి ఊరేగింపు

**సైదాబాద్, జూలై 26 ప్రభాతవార్త:** బోనాల పండుగ సందర్భంగా ఆదివారం సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ఇంటి వద్ద నుంచి ఫలహార బండి, ఘటాల ఊరేగింపు నిర్వహించనున్నారు. పోత రాజుల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజల మన్ననలు పొందే విధంగా పని చేయడం అభినందనీయం : దర్పల్లి

**సైదాబాద్, జూలై 26 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ వాటర్ వర్క్స్ డిజిఎం సరిత మీర్‌పేట కార్పొరేషన్‌కు బదిలీ కావడంతో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి గురువారం ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందే విధంగా పనిచేయడం అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ పవిత్ర, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, కరుణ్ కుమార్, నరేందర్, ఉమేష్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 10లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం : కార్పొరేటర్ శ్రావణ్..



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రావణ్..

**నేరెడ్‌మెట్, జూలై 26 ప్రభాతవార్త :** డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ శ్రావణ్ తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఓల్డ్ నేరెడ్‌మెట్ విద్యానగర్‌లో రూ. 10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా జాగ్రత్త వహించాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, నందు, మురలి గౌడ్, వెంకటేష్, ఏఇ దీపక్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయసేవాధికార అవగాహన సదస్సు..

**నేరెడ్‌మెట్, జూలై 26 ప్రభాతవార్త :** నేరెడ్‌మెట్ వాజ్‌పేయినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాయ సేవాధికార అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.శైలజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మ్కాజిగిరి మేడ్చెల్ జిల్లా లీగల్ సెల్ వాలంటరు ఎస్టీ రాకేస్ వి రమాకాంత్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాలలో ర్యాగింగ్ నిషేధమని,ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రినిస్పల్ మాట్లాడుతూ విద్యార్థులు సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సేవా విభాగం అధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ జగన్, మల్లిక అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగా భవానీ అమ్మవారి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవాణి, మల్లయ్య తదితరులు

**రామంతాపూర్, జూలై 26 ప్రభాతవార్త :** రామంతాపూర్ ఇందిరానగర్ చిన్న చెరువు వద్ద ఉన్న శ్రీ గంగా భవానీ ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రామంతాపూర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దీటి మల్లయ్య, ఆలయ కమిటి అధ్యక్షుడు పూస సత్తయ్య ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి, కాంగ్రెస్ పార్టీ నేత తవిడబోయిన గిరిబాబు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రతి ఏటా అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ధ్వజారోహణం, పంచామృత స్నపన తిరుమంజనం, చండి సప్తశతి హోమం, అనంతరం అమ్మవారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. శనివారం గంగపుత్ర సంఘం సభ్యులతో అమ్మవారి తెప్పోత్సవం, నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు ఎ.వెంకట రవికిరణ్ అచార్యులు, కమిటి నేతలు కాపర్తి మోహనకృష్ణ, వెంపటి శ్రీనివాస్, మహేందర్, మల్లేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు భూమిని తమకే చెందేలా చూడాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతి



ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ముస్లీం మైనార్టీ సభ్యులు

**తుర్కయంజాల్, జూలై 26 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 247లో 1.27 ఎకరాల వక్ఫ్ బోర్డు భూమిని ఇతరులకు కేటాయించకుండా, ముస్లిం మైనారిటీ ప్రార్థనలకు కేటాయించాలని తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గుండ్లపలి హరిత ధనరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందచేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ సోదరులకు ప్రార్థన చేసేందుకు వారికి సరిపడా స్థలాన్ని కలెక్టర్‌తో మాట్లాడి అందేలా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజాపూర్ గ్రామ మైనారిటీ సంఘ సభ్యులు మొహమ్మద్ రహీం, బురాన్, మజర్, శరీఫ్, రఫీక్, ఇల్యాస్, రషీద్, ముజీబ్‌ఖాన్, మజీద్, అఫ్రోజ్, తుర్కయంజాల్ మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్‌పాషా, షారుక్ పాల్గొన్నారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



కార్గిల్ దివస్ వేడుకల్లో పాల్గొన్న గోనె శ్రీకాంత్, డి.బాలచందర్ తదితరులు

**ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు గోనె శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిగొండ హిందూ శేఖర్‌జీ పాల్గొని ప్రసంగించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో దేశ శౌర్య పరాక్రమాలకు పట్టం కట్టిన వీర సైనికుల ధైర్య సాహసాల ప్రతిరూపం కార్గిల్ యుద్ధం ప్రాణాలకు తెగించి పాకిస్తాన్ సైనికులను నిలువరించారని తెలిపారు. దేశ కోసం ప్రాణత్యాగం చేసిన వీరసైనికుల సేవలు మరిచిపోలేనివన్నారు. కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయుడు,బిజెపి నాయకులు సతీష్, ఉప్పల్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, సీనియర్ నేతలు గోనె అంజయ్య, పి.యాదగిరి, వీరారెడ్డి,కంచర్ల భరత్‌రెడ్డి, ఆకుల అంజనేయులు, గోపు సదానంద్,ప్రదీప్, స్వామియాదవ్, పాల్వంచ విఠల్, అజయ్‌గుప్త, చంద్రయ్య, దత్తసాయి, తిరుపతి సత్యనారాయణ, నరసింహులు, సుధాకర్, రమేష్, నాంపల్లి అశోక్, కార్తీక్, మనోజ్, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **రామంతాపూర్‌లో...** రామంతాపూర్ ప్రధాన రహదారిలో బిజెపి సీనియర్ నేత తిండేరు హన్మంతరావు ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరులైన వీర జవాన్లకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త రహిత డివిజన్‌గా చిలుకానగర్ : కార్పొరేటర్ గీత ప్రవీణ్



ధర్మపురికాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ గీత

**ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌ను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తామని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని ధర్మపురికాలనీ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, శానిటేషన్ డిఇ చందన, సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలనీలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని, కాలనీ సంఘాల సహకారంతో ప్రత్యేకంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాలనీలోని ఖాళీ స్థలాలలో చెత్త వేయకుండా చూడాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కాలనీ సంఘం అధ్యక్షుడు ఎం.మధుకర్‌రెడ్డి, మాణిక్‌ప్రభు,వేణుగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, రమణమూర్తి, రత్నవేలు, ప్రకాష్, శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బాధితుడు సందీప్‌కు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ



బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త :** రామంతాపూర్ భరత్‌నగర్‌కు చెందిన స్వరూప కుమారుడు సందీప్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న సందీప్‌కు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అతనికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సిఎం సహాయనిధి కింద చేయూత అందిస్తామని తెలిపారు. మెడికల్ బిల్లులు ప్రభుత్వం నుంచి భరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో శతరుద్ర సహిత ఛండీ యాగం



యాగంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు

**తార్నాక, జులై 26 ప్రభాతవార్త:** లోక కళ్యాణార్థం తార్నాక నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్లో ప్రముఖ పురోహితులు,జ్యోతిష్యులు రామవరపు వెంకట సతీష్ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే శతరుద్ర సహిత శత చండీ యాగం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ యాగానికి మొదటి రోజు నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత నియమ నిష్టలతో తలపెట్టిన శతరుద్ర సహిత శత చండీ యాగం ఇక్కడ నిర్వహించడం మంచిపరిణామం అన్నారు. కాగా ఉదయం గణపతి పూజ, రక్షాబంధనం, దీక్షాదారణ, చండీ పారాయణ, చండీ హోమం, కలశ స్థాపన, సువాసిని పూజ, మంటప ఆరాధనలు, లక్ష కుంకుమార్చన, మహానివేదన వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించినట్లు వెంకటశర్మ పేర్కోన్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు యాగంలో పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై పోలీసుల అవగాహన




సైబర్ క్రైమ్, డ్రగ్స్ పై అవగాహన కల్పిస్తున్న నేరెడ్‌మెట్ పోలీసులు..

**నేరెడ్‌మెట్, జూలై 26 ప్రభాతవార్త :** సైబర్ క్రైమ్, డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని నేరెడ్‌మెట్ పెట్రోలింగ్ సిబ్బంది శుక్రవారం నేరెడ్‌మెట్ పోలిస్టేషన్ పరిధిలోని సంతోషిమాత చౌరస్తా వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్, డ్రగ్స్ బారిన పడి ఎంతోమంది పౌరులు, విద్యార్థులు, యువత తమ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. సరైన సమయంలో విద్యార్థులు మోసాలకు గురి కాకుండా తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు కళాశాలలో మంచి స్నేహాన్ని అలవర్చుకోవాలని అప్పుడే వారి జీవితం బాగుటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు : చేతన



డ్రైనేజీ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ చేతన తదితరులు

**ఉప్పల్, జూలై 26 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వసంత విహార్‌కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జలమండలి డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, సూపర్‌వైజర్ అంజనేయులు తదితరులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయ బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాల ఏర్పాటు



బోనాల ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, జూలై 26 ప్రభాతవార్త:** ఓల్డ్ మలక్‌పేటలోని శ్రీ పోచమ్మ దేవాలయంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని ఉత్సవాల కమిటీ ఛైర్మన్ చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్ పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను వారు దేవాలయ ట్రస్టు సభ్యులు పిటి శంకర్‌ముదిరాజ్, తులసి సురేష్‌కుమార్, వార్డుసభ్యుడు వాసు, నాయకులు టిన్నుసింగ్, ముప్పిడి శ్రీనివాస్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.